మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

గురువారం 15 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 314

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609




## కేసుల ఉచ్చు..
# వైసీపీలో కలవరం!

- ఐదు కీలక కేసుల్లో దర్యాప్తు వేగవంతం
- జగన్ అక్రమాస్తుల కేసులపై సీబీఐ, ఈడీ విచారణ
- ఓబుళాపురం గనుల కేసులో శ్రీలక్ష్మి హాజరు
- వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన ఈడీ
- లడ్డూ కల్తీ వ్యవహారంలో రూ.130 కోట్ల ఆస్తుల జప్తు
- మద్యం కేసులో మాజీ ఐఏఎస్ రజత్ భార్గవకు సమన్లు
- పెండింగ్ కేసుల్లో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ
- దర్యాప్తు అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ

**అమరావతి, ఏపీ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్న వేళ వైసీపీకి సంబంధించిన ఐదు కీలక కేసుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేసే దిశగా సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు ఓబుళాపురం గనుల కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి కోర్టుకు హాజరుకాగా, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆర్థిక లావాదేవీలపై ఈడీ విచారణ కొనసాగిస్తోంది. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఆస్తుల జప్తు, మద్యం కుంభకోణంలో మాజీ ఐఏఎస్ రజత్ భార్గవకు సమన్ల జారీ కూడా చర్చనీయాంశమయ్యాయి. ఈ కేసుల్లో పలువురిపై ఆరోపణలు ఉన్నప్పటికీ, వారి బాధ్యత, ప్రమేయానికి సంబంధించిన అంశాలు న్యాయస్థానాల్లో తేలాల్సి ఉంది. హైదరాబాద్‌లోని ప్రత్యేక సీబీఐ న్యాయస్థానంలో జగన్ అక్రమాస్తుల కేసుల విచారణకు సంబంధించి

-మిగతా 3 లో



# మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
- జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీప్కే పిలుపు
- నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
- తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
- ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో

03

**అక్టోబర్ 16న 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన**

సీఈసీ రాజీనామా డిమాండ్‌తో మరోసారి ఆందోళనకు సీజేపీ సిద్ధమైంది. 'లెహ్రా దో తిరంగా' పేరుతో అక్టోబర్ 16న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. జాతీయ జెండా ఊపడం నేరమా? అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు. ఢిల్లీకి రాలేని మద్దతుదారులు తమ ప్రాంతాల్లోనూ తిరంగా మార్చ్ నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## ఏపీలో మోగిన స్థానిక ఎన్నికల
# నగారా!

**మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు**



- అక్టోబర్ 28న మున్సిపల్ పోలింగ్
- 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- నవంబర్ 26 నుంచి పంచాయతీ పోలింగ్
- డిసెంబర్ 2న చివరి విడత ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఈసీ అనిల్ చంద్ర పుణేఠా
- రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



**అమరావతి, ఏపీ బ్యూరో,**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు తెరలేచింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పుణేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు, గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. తొలి విడతలో పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు కలిపి

-మిగతా 3 లో





03

## రైల్వే ఉద్యోగులకు మోదీ
# సర్కారు శుభవార్త

- 78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
- బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
- ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ. 17,951 చెల్లింపు
- నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
- ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం

# నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్ఆర్‌హెచ్



03



03

## రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే
# 1,000 ఫైన్

- రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
- పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలుచూస్తే ఇబ్బందులు
- తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
- హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
- కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
# రాష్ట్రపతి ముర్ము

**ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు**

- దసరా శరన్నవరాత్రుల వేళ అమ్మవారి సన్నిధికి రాష్ట్రపతి
- గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం
- పూర్ణకుంభంతో ఆలయ అధికారులు ఆహ్వానం
- వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరణ
- పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు
- క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ముర్ము ఆప్యాయ పలకరింపు
- రాష్ట్రపతి పర్యటనతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



**విజయవాడ,**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ అమ్మవారి సన్నిధికి చేరుకున్న ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రపతి రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి

-మిగతా 3 లో





03

## బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు
# మరణశిక్ష

- మీరట్ జిల్లా కోర్టు సంచలన తీర్పు
- భర్త సౌరభ్‌ను హత్య చేసినట్లు నిర్ధారణ
- మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో దాచిన నిందితులు
- వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అభియోగం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరైన నిందితులు
- గత సెప్టెంబర్ 30న ముగిసిన విచారణ
- 22 మందికి పైగా సాక్షుల విచారణ
- 13 నెలల్లోనే కేసు విచారణ పూర్తి



03

## కాశీ ఆలయంలో బంగారం మాయం!



## మహిళల ఆత్మగౌరవానికి
# ప్రతీక బతుకమ్మ

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఎదగాలి
- సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలి
- బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క సందేశం
- గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు
- ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ
- భావితరాలకు సంప్రదాయాలను అందించాలి
- మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

**హైదరాబాద్,**

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పండుగ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం తెలంగాణ మహిళలకు గర్వకారణమని అన్నారు. మహిళలు ఇతరులపై

-మిగతా 3 లో

# కేంద్ర పింఛను పథకాల్లో ఇందిర పేరు తొలగింపు



**న్యూఢిల్లీ: డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

వాటిలో కొన్నింటికి ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరును తొలగించింది. ఎన్ఎస్ఏపీని 2026-27 నుంచి అయిదేండ్ల పాటు రూ.53,428 కోట్ల బడ్జెట్‌తో కొనసాగించాలని నిర్ణయించింది.తాజా నిర్ణయం ప్రకారం ఎన్ఎస్ఏపీని ప్రధాన్ మంత్రి సామాజిక్ సహాయత యోజనగా, ఇందిరా గాంధీ వృద్ధాప్య పింఛను పథకాన్ని ప్రధాన్ మంత్రి వృద్ధావస్థ పెన్షన్ యోజనగా, ఇందిరా గాంధీ వితంతు పెన్షన్ స్కీమ్‌ను ప్రధాన్ మంత్రి విధవ పెన్షన్ యోజనగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని ప్రధాన్ మంత్రి పరివార్ లాభ్ యోజనగా మార్చారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో 1,000 మంది ఉద్యోగుల తొలగింపు




**న్యూఢిల్లీ: డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

ఆశించిన స్థాయికంటే వృద్ధి నెమ్మదించడం, వీక్షకుల సమయం కోసం మార్కెట్‌లో విపరీతంగా పోటీ పెరిగిపోవడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. 2022 తర్వాత కంపెనీ చేపట్టిన అత్యధిక ఉద్యోగాల కోత ఇదే కావడం గమనార్హం.ఈ లే ఆఫ్‌లు కంపెనీ మొత్తం వర్క్‌ఫోర్స్‌లో సుమారు ఆరు శాతం మందిపై ప్రభావం చూపనున్నాయి. 'ది వాల్ స్ట్రీట్' జర్నల్ నివేదిక ప్రకారం ఈ తొలగింపుల ప్రభావం ప్రధానంగా ప్రొడక్ట్, టెక్నాలజీ, లీగల్, హ్యూమన్ రిసోర్సెస్(హెచ్ఆర్) విభాగాలపై ఎక్కువగా పడింది.

# యూపీఐ చెల్లింపులను అంగీకరించం




**న్యూఢిల్లీ, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

ఎండీఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇకపై యూపీఐ చెల్లింపులను అంగీకరించ రాదని నిర్ణయించినట్టు వారు తెలిపారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు డిజిటల్ చెల్లింపులు చేసే వాహనదారులకు ఇది ఇబ్బందికరమే అయినప్పటికీ ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొన్నారు.చమురు కంపెనీల ఏకపక్ష నిర్ణయాలతో పెట్రోలియం డీలర్లు ఇప్పటికే తక్కువ మార్జిన్ లాభాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఎండీఆర్ వద్దని అసోసియేషన్ పంజాబ్ అధ్యక్షుడు పరంజిత్ సింగ్, అధికార ప్రతినిధి మాంటీ సెహగాల్ తెలిపారు.

# ఢిల్లీ నిరసనలపై హార్వర్డ్ స్కాలర్ల ఢీ



**న్యూఢిల్లీ డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరు, 'సర్' అవకతవలపై ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన స్కాలర్లు, విద్యార్థులు, ఆచార్యులు రెండు వర్గాలుగా విడిపోయారు! వీరిలో ఒక వర్గం నిరసనకారులను సమర్థించగా, మరొక వర్గం వారిని విమర్శించింది.ఈ నెల 10న ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన సీజేపీ మద్దతుదారులపై పోలీసుల చర్యను హార్వర్డ్ వర్సిటీకి చెందిన 100 మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది మంగళవారం ఖండించారు. పోలీసులు క్రూరంగా వ్యవహరించారని ఆరోపించారు. మరోవైపు హార్వర్డ్‌కే చెందిన 44 మంది భారత స్కాలర్లు ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసనలను భారత రాజ్యాంగ వ్యవస్థలైన ఈసీ, సుప్రీం కోర్టు లాంటి వాటిపై జరిగిన దాడులుగా అభివర్ణించారు.

# అఖిలేష్ యాదవ్‌కు షాక్..

**- బీజేపీలో చేరిన ఎస్పీ రెబల్ ఎమ్మెల్యేలు**



**డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు బుధవారం బీజేపీలో చేరారు. 2022లో ఈ ముగ్గురూ ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గౌరి గంజ్ నుంచి గెలిచిన రాకేష్ ప్రతాప్ సింగ్, గోసయ్‌గంజ్ నుంచి గెలిచిన అభయ్ సింగ్, కల్పి నుంచి గెలిచిన వినోద్ చతుర్వేది బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు ఇప్పటికే ఎస్పీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారు.2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఎస్పీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. 2027లో ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎస్పీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం అఖిలేష్ యాదవ్‌కు భారీ ఎదురుదెబ్బగానే పరిగణించాలి. పార్టీ మారిన ముగ్గురూ ఎస్పీకి అత్యంత కీలకమైన నేతలే. మరికొందరు నేతలు కూడా ఎస్పీ నుంచి బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నుంచి కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎస్పీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. కానీ, పరిస్థితి చూస్తుంటే మాత్రం ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలానే కనిపిస్తోంది. మరోవైపు ఎస్పీ.. కాంగ్రెస్‌తో పొత్తు కోసం ప్రయత్నిస్తోంది. కానీ, సీట్ల పంచాయితీ మాత్రం తేలడం లేదు. అయితే, బీజేపీలో ఎమ్మెల్యేల చేరిక ప్రభావం ఎస్పీపై ఎంతవరకు ఉంటుందో చూడాలి. యూపీలో వరుసగా రెండుసార్లు యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ అధికారం దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా గెలిచి యూపీలో హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని బీజేపీ భావిస్తోంది.

# కుంటి సాకులను ఆమోదించం..

**- కేంద్ర ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం**

**-2023 నాటి శృంగేరి ఎన్నికల కౌంటింగ్ వీడియో గల్లంతు**



**న్యూఢిల్లీ, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

అందుబాటులో ఉన్న రికార్డులను సమర్పించడంలో విఫలమైతే ఈసీఐకి వ్యతిరేకంగా ప్రతికూల నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని న్యాయస్థానం హెచ్చరించింది. తన రికార్డులను పోగొట్టుకున్నామని ఈసీఐ ఎలా చెప్పగలదు? ఎన్నికలు నిర్వహించడమే మీ ప్రధాన విధి. అటువంటప్పుడు మీ వద్ద కచ్చితంగా ఒక పత్రం ఉండాలి కదా. మేము దానిని వెతికే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడానికి ఆస్కారం ఎక్కడుంది? మీరు ఆ పత్రాన్ని ఎన్నికైన అభ్యర్థికి ఇచ్చారు.రికార్డుల భద్రత లేదా నిర్వహణ మీ వద్ద లేదా? మీ వద్ద ఉన్న దానిని తదుపరి విచారణ తేదీన సమర్పించండి. లేకపోతే మేము మీపై ప్రతికూల నిర్ణయానికి రావలసి ఉంటుంది. ఎలాంటి బలహీనమైన సాకులు మేము అంగీకరించము అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం ఈసీఐకి స్పష్టం చేసింది. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీఎన్ జీవరాజ్‌పై 201 ఓట్ల స్వల్ప తేడాతో విజయం సాధించినప్పటికీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల పునఃలెక్కింపు అనంతరం తన పదవిని కోల్పోయిన కాంగ్రెస్ నేత టీడీ రాజేగౌడ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరుపుతున్నది. 2023లో జరిగిన అసలు లెక్కింపు, ఈ ఏడాది మేలో నిర్వహించిన రీకౌంటింగ్, రెండింటికీ సంబంధించిన ఎన్నికల పరిశీలకుడి నివేదిక వీడియో రికార్డింగులను రాజేగౌడ కోరిన తర్వాత, ఫుటేజ్‌ను గుర్తించడంలో విఫలమైనందుకు ఈసీఐని ధర్మాసనం తప్పుపట్టింది.

# అరామ్‌కో హెడ్‌క్వార్టర్స్‌పై హౌతీల దాడి

**యెమెన్‌పై దాడులు ఆపకపోతే మరింతగా విరుచుకుపడతాం**

**సౌదీ అరేబియాకు వార్నింగ్**




**రియాద్ డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

సౌదీ అరేబియాలో హౌతీల దాడులు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. సౌదీ అరేబియాలోని తూర్పు నగరం ధహ్రాన్‌లో ఉన్న ఆ దేశ జాతీయ చమురు సంస్థ అరామ్‌కో ప్రధాన కార్యాలయంలోని ఓ పరిపాలనా భవనంపై మీద మంగళవారం హౌతీలు బాలిస్టిక్ క్షిపణులు,క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారు. ఈ విషయాన్ని ఆ దేశ ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. బిల్డింగ్‌లోని పై మూడు అంతస్తులు దెబ్బతిన్నాయని, ఇందులో సీఈవో కార్యాలయం కూడా ఉందని చెప్పింది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మంటలను వెంటనే ఫైర్ సిబ్బంది అదుపుచేసినట్టు అధికారులు చెప్పారు. చమురు కేంద్రాలకు సిబ్బంది, పౌరులు దూరంగా ఉండాలని హౌతీలు ప్రకటించిన కొద్ది సేపటికే ఈ దాడి జరిగింది.

**దాడులు కొనసాగిస్తాం..**

చమురు సంస్థలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని.. అందుకే తమకు అవి దాడి చేసే లక్ష్యాలుగా ఉన్నట్టు హౌతీలు చెప్పారు. సౌదీలోని ఎయిర్‌పోర్టులు, చమురు కేంద్ర సంస్థలపై దాడులను కొనసాగిస్తామని హెచ్చరించారు. యెమెన్ మీద సౌదీ దాడులు ఆపకపోతే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని.. సాధారణ పౌరులు తాము ఎంచుకున్న లక్ష్యాలకు దూరంగా ఉండాలని హౌతీలు కోరారు.

**బయటకు రాకండి..**

సౌదీలో వైమానిక దాడులు జరిగే సమయంలో ఇండ్లలోనే ఉండాలని, బయటకు రావొద్దని సౌదీలోని భారత ఎంబసీ సూచించింది. ఎంబసీ అధికారులు జారీచేసే హెచ్చరికలు, సూచనలు పాటించాలని చెప్పింది. దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని తెలిపింది. ఎలాంటి సహాయం కావాలన్నా ఎంబసీకి కాల్ చేసి చెప్పాలని కోరింది. సౌదీ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని చెప్పింది.

# జర్మనీలో అగ్నిప్రమాదం.. భారతీయుల మృతి

**బోచుమ్ (జర్మనీ), డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**



జర్మనీలోని బోచుమ్ నగరంలో హోస్ట్‌ఫెడ్ ప్రాంతంలో మంగళవారం ఒక నివాస భవనంలో అనుమానాస్పద స్థితిలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడో అంతస్తులోని ముగ్గురు భారతీయులు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. ఇది హత్యగా అనుమానించిన పోలీసులు అదే భవనంలో నివసిస్తున్న 41 ఏండ్ల వ్యక్తిని అరెస్ట్ చేశారు. అయితే మృతుల, క్షతగాత్రుల వివరాలను అధికారులు వెల్లడించ లేదు. అరెస్టయిన వ్యక్తి రొమేనియా దేశస్తుడని మీడియా తెలిపింది.

# అజర్‌బైజాన్ బడుల్లో హిజాబ్‌పై నిషేధం!



**బాకు, అక్టోబర్ 14 డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

: దేశంలో 96 శాతం ముస్లిం జనాభా ఉన్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల డ్రెస్‌కోడ్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయంపై మండిపడ్డ విద్యార్థినులు తరగతులు బహిష్కరించి నిరసనలు జరిపారు'హిజాబ్ పాపం కాదు.. ఒక దేవదూత' అని నినాదాలు చేశారు. అజర్‌బైజాన్ జనాభాలో 96 శాతం ముస్లింలు, వీరిలో షియాలు మెజారిటీ కాగా, సున్నీలు కూడా అధికంగానే ఉంటారు. అయినప్పటికీ తమది లౌకిక దేశంగా అజర్‌బైజాన్ ప్రకటించుకుంది.

# బాలికపై రోబో లైంగిక వేధింపులు!



**కొలోన్ : డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

ఒక రోబో 16 ఏండ్ల బాలికను తడిమి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జర్మనీలోని కొలోన్‌లో శనివారం చోటుచేసుకుంది. ఈ రోబో పోలీసుల అదుపులో ఉంది. నాలుగు అడుగుల ఎత్తున్న ఈ హ్యూమనాయిడ్ రోబో బాలిక వెనుక ఆమెను తడమడమే కాక, అసభ్య కదలికలు చేసింది. ఈ రోబోను రిమోట్ ద్వారా నియంత్రిస్తున్న ఇద్దరు బాలురు ఈ దృశ్యాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.దీంతో పోలీసులు రోబోతో పాటు 16, 19 ఏండ్ల ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. స్నేహితులతో వచ్చిన ఆ అమ్మాయి పామ్‌స్ట్రాస్‌లోని ఒక ఫాస్ట్‌పుడ్ రెస్టారెంట్‌లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆ బాలికపై ఉద్దేశపూర్వకంగా రోబోతో లైంగిక వేధింపులకు ప్రయత్నించారా అన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామని వారు చెప్పారు.

# మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

-అక్టోబర్ 16న 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన
-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
-ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
-జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీప్కే పిలుపు
-నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
-తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
-ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
-సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో



న్యూఢిల్లీ:
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మరోసారి నిరసనలకు సీజేపీ పిలుపునిచ్చింది. అక్టోబర్ 16న శుక్రవారం 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బుధవారం ప్రకటించారు. జాతీయ జెండాను ఊపుతూ నిరసన తెలిపే ఈ కార్యక్రమాన్ని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనేవారు జాతీయ జెండాలతో రావాలని కోరారు. తిరంగా జెండాను ఊపడం నేరమా అని దీప్కే ప్రశ్నించారు. జెండా ఎగురవేసినందుకే తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను జైలులో పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఢిల్లీలో అనుమతి లేకుండా నిరసన నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం వారిద్దరూ తిహార్ జైలులో ఉన్నట్లు సమాచారం. వారిని వేర్వేరు గదుల్లో ఉంచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అక్టోబర్ 16న ఢిల్లీలో నిర్వహించే తిరంగా కార్యక్రమంలో మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దీప్కే పిలుపునిచ్చారు. ఢిల్లీకి రాలేని వారు తమ సొంత ప్రాంతాల్లోనే జాతీయ జెండాలతో తిరంగా మార్చ్ నిర్వహించాలని సూచించారు. జెండాను ఊపడం నేరం కాదని నిరూపించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపడుతున్న నిరసనలను ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో అనుమతులు, పోలీసు చర్యల కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురయ్యాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఆందోళనకు ఎలాంటి స్పందన లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్ఆర్‌హెచ్



ముంబై
యార్కర్ కింగ్ టి. నటరాజన్ మళ్లీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి వచ్చాడు. క్రికెట్ అభిమానులు ముద్దుగా 'నట్టూ' అని పిలుచుకునే ఈ లెఫ్టార్మ్ పేసర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి సన్‌రైజర్స్ ట్రేడ్ చేసుకుంది. అతడికి బదులుగా స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీ జట్టుకు అప్పగించింది. 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన నటరాజన్ కీలక బౌలర్‌గా గుర్తింపు పొందాడు. తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టే నట్టూ, ఇప్పుడు మరోసారి పాత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రూ. 5 కోట్ల ధరతో అతడు సన్‌రైజర్స్‌లో చేరగా, జీషన్ అన్సారీ తన కనీస ధర రూ. 40 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడనున్నాడు.

# మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

మొదటి తరువాయి

ఆధారపడే స్థితి నుంచి ఎదిగి, సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. మహిళల సాధికారత, ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ పూర్వీకులు అందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వమని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, చెరువులను పూజిస్తూ, రంగురంగుల పూలతో అమ్మవారిని కొలవడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. ఆడబిడ్డ అమ్మగారింటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆత్మీయతను పంచుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపే అపురూపమైన వేడుక బతుకమ్మ అని అన్నారు. తెలంగాణలోనే కాకుండా దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ మహిళలు సైతం బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని సీతక్క తెలిపారు. ఆస్తులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చని, పదవులు పోతే మళ్లీ పొందవచ్చని, కానీ కనుమరుగైన సంస్కృతి సంప్రదాయాలను తిరిగి తీసుకురావడం కష్టమని అన్నారు. పూర్వీకులు అందించిన ఆటపాటలు, సంప్రదాయాలే మహిళలకు గొప్ప ఆస్తులని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి కోసం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. బతుకమ్మ వంటి పండుగలు మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుతాయని సీతక్క అన్నారు.

# బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

మొదటి తరువాయి

ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాష్ట్రపతి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు రాష్ట్రపతికి పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆమెకు మర్యాదలు చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం పర్యటనలో ప్రధాన ఘట్టంగా నిలిచింది. దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పోలీసులు, సంబంధిత అధికారులు ఆలయం, పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

# కేసుల ఉచ్చు.. వైసీపీలో కలవరం!

మొదటి తరువాయి



కీలక నిర్ణయం తీసుకున్నట్లు కథనాలు వెల్లడించాయి. సీబీఐ నమోదు చేసిన కేసులతో పాటు ఈడీ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులను కూడా సమాంతరంగా రోజువారీ విచారించాలని కోర్టు నిర్ణయించినట్లు సమాచారం. సీబీఐ కేసుల విచారణ పూర్తయిన తర్వాతే ఈడీ కేసులను చేపట్టాలన్న జగన్ తరఫు న్యాయవాదుల వాదనను కోర్టు అంగీకరించలేదని కథనాలు పేర్కొన్నాయి. సీబీఐ దాఖలు చేసిన 11 చార్జిషీట్లు, ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్ల విచారణ ముందుకు సాగితే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పురోగతి సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఆమెకు సంబంధించిన కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసులో తదుపరి న్యాయప్రక్రియపై ఆసక్తి నెలకొంది. అభియోగాల నమోదు, తదుపరి విచారణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది చర్చనీయాంశమైంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆర్థిక లావాదేవీల కోణంలో ఈడీ విచారణ చేపట్టినట్లు కథనాలు పేర్కొన్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అధికారులు సుమారు ఏడు గంటలపాటు ప్రశ్నించినట్లు సమాచారం. అప్రూవర్ దస్తగిరి వాంగ్మూలం, గతంలో సోదాల్లో లభించిన నగదు, బ్యాంకు లాకర్లు, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. హత్యకు సంబంధించి రూ. 40 కోట్ల సుపారీ వ్యవహారంపై వచ్చిన ఆరోపణల కోణంలోనూ దర్యాప్తు సాగుతున్నట్లు కథనాలు వెల్లడించాయి. ఈ ఆరోపణలపై తుది నిర్ధారణ న్యాయప్రక్రియలో జరగాల్సి ఉంది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో ఈడీ ఆస్తుల జప్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సుమారు రూ. 130 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. బోలేబాబా, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్ సంస్థలు, వాటి ప్రమోటర్లకు సంబంధించిన ఆస్తులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించాయి. నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ. 234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేశారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. దర్యాప్తులో వెల్లడయ్యే అంశాలు, న్యాయపరమైన నిర్ణయాలు తదుపరి పరిణామాలను నిర్దేశించనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలున్న మద్యం కుంభకోణంలోనూ ఈడీ విచారణ కొనసాగుతోంది. అప్పట్లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు సమన్లు జారీ చేసినట్లు సమాచారం. మద్యం విధానం రూపకల్పన, కంపెనీలకు ఆర్డర్ల కేటాయింపు, సరఫరా, విక్రయాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతుండగా, ఈడీ దర్యాప్తు కూడా కొనసాగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలు చూస్తే ఇబ్బందులు
తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం



హైదరాబాద్,
రైలు ప్రయాణాల్లో తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఇకపై రైళ్లలో మొబైల్ ఫోన్ స్పీకర్ ఆన్ చేసి పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటం, ఫోన్‌లో గట్టిగా మాట్లాడటం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇతర ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వారిపై రూ. 1,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ైళ్లలో ప్రయాణించే సమయంలో కొందరు మొబైల్ ఫోన్లలో పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటంతో ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరహా ఘటనలపై ఫిర్యాదులు పెరుగుతుండటంతో రైల్వే అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికుల నిద్రకు భంగం కలగకుండా చూడటంపై దృష్టి సారిస్తున్నారు. హెచ్చరికలు చేసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే పరిస్థితిని బట్టి మరింత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇండియన్ రైల్వేస్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్ష, రూ. 5,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రైల్వే స్టేషన్లలోనూ శబ్దానికి సంబంధించిన నిబంధనలను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో పాటలు వినాలన్నా, వీడియోలు చూడాలన్నా ఇయర్‌ఫోన్లు లేదా హెడ్‌ఫోన్లు ఉపయోగించాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా తక్కువ శబ్దంతో మాట్లాడి ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

# కాశీ ఆలయంలో బంగారం మాయం!



వారణాసి
అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల అవకతవకలపై అభాసుపాలైన యూపీ బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు కాశీ విశ్వనాథ ఆలయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని ప్రసిద్ధ కాశీ విశ్వనాథుని ఆలయంలో బంగారం చోరీకి గురైందంటూ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. వారణాసి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది నిత్యానంద్ రాయ్ ఈ విషయమై ప్రధానమంత్రి కార్యాలయానికి(పీఎంఓ) లేఖ రాశారు. ఆలయ శిఖరంతో పాటు, పలు ప్రాంతాల్లో బంగారం కనిపించడం లేదని, ఆలయ యాజమాన్యం ఆ ప్రదేశాలకు రంగులు వేసి, విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.

## బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు మరణశిక్ష

ముంబై
: దేశంలో సంచలనం సృష్టించిన మీరట్, బ్లూడ్రమ్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ మీరట్‌కు చెందిన జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కోర్టు జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణ గత సెప్టెంబర్ 30న పూర్తికాగా.. నిందితులు ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా నేరానికి పాల్పడ్డట్లు తేలింది.దీంతో ఆరోజు తీర్పు రిజర్వ్ చేయగా, నేడు తీర్పు వెల్లడించారు. ఈ ఘటనలో హత్యకు గురైంది రస్తోగి భర్త సౌరభ్ భరద్వాజ్. తీర్పు వెలువడుతున్న సమయంలో జిల్లా జైలులో ఉన్న నిందితులు ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. బ్లూ డ్రమ్ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఉత్తర ప్రదేశ్, మీరట్‌కు చెందిన నేవీ మాజీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్.. 2025, మార్చి 3న హత్యకు గురయ్యాడు. అతడి భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి సౌరభ్‌ను హత్య చేశారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సౌరభ్‌ను హత్య చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో ఉంచారు. పైనుంచి సిమెంట్ పోసి, కప్పేశారు. దీంతో అతడి మృతదేహం అందులోనే కూరుకుపోయింది. ఘటన జరిగిన కొన్ని రోజులకు పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఈ హత్య ఘటన బయటపడింది. సౌరభ్‌ను ముస్కాన్, ఆమె క్లాస్‌మేట్, ప్రియుడు సాహిల్ కలిసి హత్య చేసినట్లు తేలింది. దీనిపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభమైంది. మొత్తం 13 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తై, తీర్పు వెలువడటం విశేషం. ఈ కేసులో 126 వాదోపవాదాలు జరిగాయి.

# రైల్వే ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త

-78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
-11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
-బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
-ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చెల్లింపు
-నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
-ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం



ముంబై
రైల్వే శాఖ ఉద్యోగులకు మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం శుభవార్త అందించింది. రైల్వే ఉద్యోగులకు 78 రోజుల దసరా బోనస్ ప్రకటిస్తూ మోదీ క్యాబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తం విలువ రూ. 2,009 కోట్లుగా ఉంది. పీఎల్‌బీ (ప్రొడక్టివిటీ లింకుడ్ బోనస్) కింద ఉద్యోగులకు ఈ మొత్తం రైల్వే శాఖ చెల్లించనుంది. ఈ నిర్ణయం ద్వారా 11,40,770 మంది రైల్వే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రతి ఏడాది దసరా సందర్భంగా రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ప్రకటిస్తుంటుంది. ఈ ఏడాది 78 రోజుల బోనస్ ప్రకటించింది. ఒక ఉద్యోగికి గరిష్టంగా రూ. 17,951 వరకు అందుతాయి. 78 రోజుల బోనస్ అయినప్పటికీ.. చెల్లింపులపై పరిమితి వల్ల ఈ మొత్తం తక్కువగా ఉంటుంది. దీనిద్వారా ట్రాక్ మెయింటెనర్స్, స్టేషన్ మాస్టర్స్, ట్రైన్ మేనేజర్లు, టెక్నీషియన్లు, లోకోపైలట్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్ హెల్పర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, పాయింట్‌మ్యాన్‌తోపాటు ఇతర గ్రూప్-సి సిబ్బందికి బోనస్ అందుతుంది. బోనస్ ప్రకటన సందర్భంగా కేంద్ర క్యాబినెట్ కీలక వ్యాఖ్యలు చేసింది. 2025-26 రైల్వే శాఖకు చాలా మంచి సమయం అని, ఈ సమయంలో రైల్వే శాఖ 1,670 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసిందని తెలిపింది. అలాగే, ఇదే కాలంలో 7.41 బిలియన్ల మంది ప్రయాణికులు రైళ్లో ప్రయాణించారు. ఇక, ఫేక్ బోనస్ లెటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రైల్వే బోర్డు సంబంధిత ఉద్యోగులకు సూచించింది. మరోవైపు తమకు డీఏ పరిమితిని గరిష్టంగా రూ. 18,000 నుంచి పెంచాల్సిందిగా ఇండియన్ రైల్వేస్ టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. లెవల్2, ఆపై ఉద్యోగులకు వర్తించేలా చూడాలని కోరింది.

# ఏపీలో మోగిన స్థానిక ఎన్నికల నగారా!

మొదటి తరువాయి



మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ పూర్తిచేస్తారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. రెండో విడతలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 5న ఫలితాలు వెల్లడించనున్నారు. మూడో విడతలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను మూడు దశలుగా విభజించి నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ చేపట్టనున్నారు. ఆయా దశల్లో ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనకు సంబంధించిన వివరాలను ఎన్నికల అధికారులు వెల్లడించనున్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు పరిష్కారమై, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైనట్లు సమాచారం. షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు, స్థానిక నాయకులు ఎన్నికల సన్నాహాలపై దృష్టి సారించనున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, స్థానిక సమస్యల ఆధారంగా పోటీకి సిద్ధమయ్యే అవకాశం ఉంది.

# ఈవీఎంల భద్రతలో నిర్లక్ష్యం వద్దు!

**-గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల క్రైం । డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

నంద్యాల: ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాముల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదాములను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల తాళాలు, సీల్స్, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, పోలీసు భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాముల భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, సీసీటీవీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈవీఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూ, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్' 'ఎన్నికల' నిర్వహణకు సర్వం 'సిద్ధం' చేయాలి..

**-మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత**

**-కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో ఏర్పాట్ల పరిశీలన**

**-రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌లను తనిఖీ చేసిన కలెక్టర్.**



**మార్కాపురం,డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు.బుధవారం

కనిగిరి లోని అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌లను (ఓట్ల లెక్కింపు హాళ్లు) కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతతో పర్యవేక్షించాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి కేంద్రంలోనూ భద్రత, వెలుతురు (లైటింగ్), సీసీ కెమెరాల నిఘా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులలో ఎలాంటి లోపం లేకుండా పక్కాగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ మరియు స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి గందరగోళం తలెత్తకుండా మార్గదర్శకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతతో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు.ఈ పరిశీలనలో ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మంథని ప్రాంతీయ పశు వైద్యుల సేవలు నిర్వీర్యం




**మంథని, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

మంథని పట్టణం చుట్టు పక్క గ్రామాలకు సేవలందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వైద్యశాల సిబ్బంది అందించే సేవలు నిలిచిపోయాయి.

పశు వైద్యశాల సిబ్బంది నిర్వహణ పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడి వైద్యం కోసం తీసుకొచ్చిన ప్రాణులకు సరైన మందులు లేవు. చికిత్సను అందించే సమయం చూసే పరిస్థితి లేదు. ప్రజలు కట్టే పన్నులతో ప్రభుత్వం నుండి వేల జీతాలు తీసుకుంటూ విధి నిర్వహణలో మాత్రం సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆఫీస్ సమయ వేళలు 10:00 గంటల నుండి 4:00 గంటల వరకు ఉంటుంది. కానీ పశు వైద్యశాల సిబ్బంది ఎలాంటి సమయపాలన పాటించడం లేదు. మధ్యాహ్నం 2:00 గంటల లోపే కార్యాలయానికి తాళాలు వేసుకొని వెళ్లిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఆఫీస్ సమయం ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉండడం లేదు. ఈ విధమైన పశు వైద్యశాల నిర్వహణ పట్ల పాడి పశువుల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పశు వైద్యశాల ఇలాంటి నిర్లక్ష్యపు బాధ్యత రాహిత్య చర్యల పట్ల పశువైద్య శాఖ పై స్థాయి అధికారులు స్పందించి పాడి పశువులకు, జంతువులకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యాచరణ చేయాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు..

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

**జిల్లావ్యాప్తంగా ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి**

**-అధికారులకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాలు**



**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 14, 2026**

నంద్యాల: స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

ప్రచార హోర్డింగ్‌లు, బ్యానర్లు వెంటనే తొలగించాలి

ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ ప్రచార చిత్రాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ వాహనాలు, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదని స్పష్టం చేశారు. కొత్త అభివృద్ధి పనుల మంజూరు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల విషయంలో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆస్తులపై ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయాలంటే సంబంధిత యజమానుల అనుమతి తీసుకోవాలని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియకు ముందస్తు ఏర్పాట్లు

నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటి ప్రక్రియలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రచార వాహనాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

సోషల్ మీడియా ప్రచారంపైనా నిఘా

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో రాము నాయక్, ఏఓ సుభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం..

**- మాజీ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఈడీ నోటీసులు**

**-విచారణకు హాజరు కావాలని రజత్ భార్గవకు ఈడీ ఆదేశం**

**-వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు**

**-మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ**



**అమరావతి, ఏపీ బ్యూరో డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో విచారణ మరింత వేగవంతమైంది. ఈ కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో భాగంగా, హైదరాబాద్‌లోని తమ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో రూపొందించిన నూతన మద్యం విధానం, మద్యం బ్రాండ్ల ఆమోదం, కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది.ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రజత్ భార్గవను పలుమార్లు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. సిట్ విచారణలో భాగంగా, నాటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే మద్యం విధానంలో అక్రమాలు జరిగాయని, బేస్ ధరల పెంపును తాను వ్యతిరేకించినా పట్టించుకోలేదని భార్గవ వాంగ్మూలం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.

**సిట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ,**

సిట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ, ఇప్పుడు ఆర్థిక లావాదేవీల మూలాలను శోధిస్తోంది. భార్గవను ప్రశ్నించడం ద్వారా ఈ కుంభకోణంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి

# జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా...

**-విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?**

**-కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్**

**-విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు**

**-జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్**

**-విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం**

**-కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు**



**అమరావతి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది.

**విజయవాడ మేయర్ రేసులో వంగవీటి రాధా..?**

విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది.

**స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్**

మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది.

సీట్ల సర్దుబాటుపై కూటమి నేతల చర్చలు

స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశం అయ్యారు. విజయవాడ లోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది

# వివేకా హత్య కేసులో.. ఈడీ విచారణకు హాజరైన వైఎస్ అవినాశ్ రెడ్డి

**-మనీలాండరింగ్ కోణంలో కొనసాగుతున్న ఈడీ దర్యాప్తు**

**-హత్యకు సంబంధించి రూ.40 కోట్ల డీల్‌పై ప్రధాన దృష్టి**

**-హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ**



**అమరావతి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ లోని ఈడీ కార్యాలయంలో ఆయన అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీల కోణంలో ఈడీ అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. రూ.40 కోట్ల డీల్ ఆరోపణలపై ఈడీ ప్రధాన దృష్టి ఈ హత్య వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలపై... ముఖ్యంగా రూ.40 కోట్ల డీల్ జరిగిందన్న ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలను ఈడీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

**2019 నుంచి బ్యాంకు లావాదేవీలు, నిధుల బదిలీలపై లోతుగా ఆరా**

ఈ కేసులో భాగంగా ఈడీ ఇప్పటికే పలువురు నిందితులను, అప్రూవర్లుగా మారిన వారిని కూడా విచారించింది. 2019 నుంచి జరిగిన బ్యాంకు లావాదేవీలు, నిధుల బదిలీలపై లోతుగా ఆరా తీస్తోంది. గతంలో హైదరాబాద్, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలతో పాటు లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా విచారణతో

ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది

# తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండి

**-కాలానుగుణంగా సాంకేతికపై పట్టు సాధించండి**

**-పెద్దపల్లి డిసిపి భూక్యా రాంరెడ్డి**



**రామగిరి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
ఎంతో కష్టపడి ఉన్నత చదువులకై పంపిస్తున్న తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుపైనే ద-ష్టి సారించాలని,క్షలానుగుణంగా వస్తున్న సాంకేతికపై పట్టు సాధించాలని పెద్దపల్లి డిసిపి భూక్యా రాంరెడ్డి పిలుపునిచ్చారు.మంథని జటటఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహఇంచిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డిసిపి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ తాము చిన్నప్పుడు కష్టపడి చదివి నేడు ఈ స్థానానికి చేరుకున్నామని,విద్యార్థులు సైతం ఉజ్వల భవిష్యత్తుకై నిరంతరం శ్రమించాలన్నారు.కొంత మంది విద్యార్థులు డ్రగ్స్ లాంటి వాటికి ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గంజాయి,డ్రగ్స్ లింటివి అమ్మినా, సేవించినా తమ ద-ష్టికి తీసుకొని రావాలని,వీరి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.సులువుగా డబ్బులు సంపాదించాలనే తపనతో సైబర్ నేరంలో చిక్కుకుంటున్నాన్నా రు. ఓటిపి చెప్పవద్దని,ఎస్, నో లాంటివి చేయవద్దు అన్నారు.అరైవ్ .. అలైవ్ క్రింద అతి వేగం,హెల్మెట్ దరించక పోవడం,సీటు బెల్టు పెట్టుకొక పోవడం సరైంది కాదన్నారు. రేయింబవళు కష్టపడి చదవి ఉజ్వల భవిష్యత్తు ఏర్పర్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఆర్జి3 జిఎం సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్టు జిఎం కొలిపాక నాగేశ్వర్రవ్, జగిత్యాల, సిరిసిల్ల జటటఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జి నర్సింహ, వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఎం ఉదయ్ కుమార్, అధ్యాపక, నాన్ టీచింగ్ సిబ్బంది, ప్రథమ, ద్వితీయ విద్యార్థులు పాల్గోన్నారు. అతిధులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అనంతరం నిర్వహించిన సాంస్క-తిక కార్యక్రమాలు అలరించాయి.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 3వ సారి 5500 రూపాయలు అందజేత





**రామగిరి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
బుధవారం పాలాబిశేకం చేసిన ఐఎన్టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఔట్సోర్సింగ్ లేబర్ యూనియన్ ఆర్జీ త్రీ వైస్ ప్రెసిడెంట్ మబ్బు శంకర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్ యాదవ్, రీజినల్ జనరల్ సెక్రెటరీ బండ కిరణ్ రెడ్డి,శ్రీరాముల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే విధంగా సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణిలో సింగరేణి కార్మికులతో పాటుగా కాంట్రాక్ట్ కార్మికులకు 5500 రూపాయలు మూడోసారి ప్రకటించినందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,బట్టి విక్రమార్క, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్,నర్సరీ మహిళా కార్మికులు పాల్గొని కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# మంథని ప్రాంతీయ పశు వైద్యుల సేవలు నిర్వీర్యం




**మంథని, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
మంథని పట్టణం చుట్టు పక్క గ్రామాలకు సేవలందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వైద్యశాల సిబ్బంది అందించే సేవలు నిలిచిపోయాయి. పశు వైద్యశాల సిబ్బంది నిర్వహణ పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడి వైద్యం కోసం తీసుకొచ్చిన ప్రాణులకు సరైన మందులు లేవు. చికిత్సను అందించే సమయం చూసే పరిస్థితి లేదు. ప్రజలు కట్టే పన్నులతో ప్రభుత్వం నుండి వేల జీతాలు తీసుకుంటూ విధి నిర్వహణలో మాత్రం సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆఫీస్ సమయ వేళలు 10:00 గంటల నుండి 4:00 గంటల వరకు ఉంటుంది. కానీ పశు వైద్యశాల సిబ్బంది ఎలాంటి సమయపాలన పాటించడం లేదు. మధ్యాహ్నం 2:00 గంటల లోపే కార్యాలయానికి తాళాలు వేసుకొని వెళ్లిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఆఫీస్ సమయం ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉండడం లేదు. ఈ విధమైన పశు వైద్యశాల నిర్వహణ పట్ల పాడి పశువుల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పశు వైద్యశాల ఇలాంటి నిర్లక్ష్యపు బాధ్యత రాహిత్య చర్యల పట్ల పశువైద్య శాఖ పై స్థాయి అధికారులు స్పందించి పాడి పశువులకు, జంతువులకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యాచరణ చేయాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు..

# రాజీ కుదుర్చు కోవడం ద్వారా పెండింగ్ కేసులకి మోక్షం లభిస్తోంది



**/మెట్ పల్లి డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
ఇద్దరూ పరస్పరం రాజీ కు దుర్చుకోవడం ద్వారా పెం డింగ్ కేసులకి మోక్షం లభి స్తోందని మెట్ పల్లి సీనియ ర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ పేర్కొన్నారు. మం డల లీగల్ సర్వీసెస్ ఆధ్వ ర్యంలో బుధవారం మెట్ ప ల్లి కోర్టు కాంప్లెక్స్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవంబర్ 21 న చెక్ బౌన్స్ కేసులకి సంబంధించి దేశవ్యాప్తంగా ప్రత్యేక అదాలత్ నిర్వహి స్తున్నట్టు తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరూ పర స్పరం రాజీ పడటం వల్ల స మయం తో పాటూ, ఖర్చు లు కూడా ఆదా అవుతా యాని తెలిపారు. కక్షి దారు ల రాజీ కోసం ఇరుపార్టీల న్యాయవాదులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చే సారు. ఈ సమావేశంలో బా ర్ అసోసియేషన్ అధ్యక్షు లు ఏలేటి రాంరెడ్డి, అడిష నల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చె ర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెం ట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దు ల్ హఫీజ్, లోక్ అదాలత్ మెంబెర్స్ వడ్డేపల్లి శ్రీనివాస న్, జేడి సుధాకర్, మీడియా షన్ కో ఆర్డినేటర్లు బక్కూరి రమేష్, తునికి వేణు గోపా ల్, పసునూరి శ్రీనివాస్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, పుప్పాల లింబాద్రి, ఎలముల రాంబా బు, గుమ్మడి రాజేశ్వర్, మ గ్గిడి నర్సయ్య, కోల అశోక్, కాజీపేట స్రవంతి, మామిడి పల్లి విజయలక్ష్మి, వెల్మల స్వప్న, రజిత ఉన్నారు.

## గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలి

-జైపూర్ ఎంపీడీఓ శ్రీపతి బాపూరావు



**, జైపూర్, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామపంచాయతీలో ఎంపీడీఓ,మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపూరావు యాప్ ఇన్స్పెక్షన్ భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలోని పంచాయతీ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాలను ఫీల్డ్ లో సశీదర్శించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు.

**ఈ సందర్భంగా సిబ్బందికి క్రింది సూచనలు/ ఆదేశాలు జారీ చేశారు:**

1. గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా నిరంతరం చర్యలు చేపట్టాలి.
2. గ్రామ పరిధిలో ఎక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
3. ప్రతి ఇంటి నుండి తడి చెత్త (వెట్ వేస్ట్ ), పొడి చెత్త (డ్రై వేస్ట్ ) వేరువేరుగా సేకరించాలి.
4. సేకరించిన వ్యర్థాలను సిగ్రిగేషన్ షెడ్ కు తరలించి, తడి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి సేంద్రియ ఎరువు (కంపోస్ట్ ) తయారు చేయాలి అని
5. వి బి జి ఆర్ ఏ ఎం జి పథకం లో కూలీల సంఖ్య 60కి తగ్గకుండా చర్యలు చేపట్టాలని, వీలైనంత త్వరగా వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.

ఇట్టి సందర్శనలో కిష్టాపూర్ సర్పంచ్ దుర్గం మహేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు..

# ఎస్.జీ.ఎఫ్ క్రికెట్ లో ప్రతిభ కనబర్చిన సాక్షిత్



**రామగిరి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన పల్లె సాక్షిత్ రావు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలలో ప్రతిభ కనబరిచారు.పెద్దపల్లి జిల్లా ఎన్.టీ.పీ.సీ లో ఎస్.జీ.ఎఫ్ క్రికెట్ పోటీలు జరిగాయి. పెద్దపల్లి జిల్లా అండర్-17 కెప్టెన్ గా వ్యవహరిస్తున్న సాక్షిత్ రావు,కమాన్ పూర్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం చదువుతున్నాడు.కరీంనగర్ జట్టు పై 2 ఓవర్ల వేసి,3 వికెట్లు తీసి,7 పరుగులు ఇచ్చాడు.ఒక్క రన్ అవుట్ చేశారు.సాక్షిత్ రావు ను ఎస్.జీ.ఎఫ్ పెద్దపల్లి జిల్లా సెక్రటరీ కనుకుంట్ల.లక్ష్మన్,మాజీ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్,కోచ్ ఎం.సుదేశ్,సురేష్ అకాడమీ కోచ్ ఎం.సురేష్,హేమంత్,అనిల్ రెడ్డి లు అభినందించారు.

# శ్రీ దుర్గామాత నవరాత్రులలో భాగంగా ప్రత్యేక పూజలు

**-మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్**



**రామగిరి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
బుధవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బేగంపేట్ లోని శ్రీ దుర్గామాత ఆలయాన్ని మంథని బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్ దర్శించుకున్నారు.మహా చండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు స్వీకరించి,అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా తోట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ఆ మహాచండీ దేవి ఆశీస్సులతో మన మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారి కృప ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్న నవాబుపేట గ్రామ సర్పంచ్ రొడ్డ మౌనిక సతీష్ కుమార్,బేగంపేట గ్రామ సర్పంచ్ మంతెన చంటి,బేగంపేట ఉప సర్పంచ్ సందేల రేణుక కుమారస్వామి.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, ఆదివారంపేట గ్రామ సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, బేగంపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చీరల పంపిణీ

**-సివిల్ సూపర్వైజర్ బెల్లం శ్రీను,కార్యాలయ క్లర్క్ జ్యోతి ఆధ్వర్యంలో**

**-చీరలు పంపిణీ చేసిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,ఆర్జి త్రీ జిఎం సుంకరి మధుసూదన్**



**రామగిరి, డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026**
బుధవారం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి అర్జి త్రీ జీఎం కార్యాలయంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది.జీఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సివిల్ సూపర్వైజర్ బెల్లం శ్రీను మరియు కార్యాలయ క్లర్క్ జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, ఆర్ జి త్రీ జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్ మహిళా కార్మికులకు తమ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం,మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహతి క్రియేషన్స్ ప్రారంభోత్సవం.



**డ్రీమ్ టైమ్స్ 14 అక్టోబర్ 2026 మేడిపల్లి ;అక్టోబర్ 14;**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్, విహారిక కాలనీలో మహతి క్రియేషన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విహారిక కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీల, డివిజన్ నాయకులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం ధరలు

-ఒక్కరోజే పది గ్రాములపై రూ.1,030 తగ్గుదల
-రూ.1,48,260కు చేరిన 24 క్యారెట్ల పసిడి
-22 క్యారెట్ల బంగారం ధర రూ.1,35,900
-మూడు రోజుల్లో భారీగా దిగివచ్చిన ధరలు
-24 క్యారెట్లపై రూ.3,160 తగ్గుదల
-22 క్యారెట్లపై రూ.2,900 మేర పతనం
-స్థిరంగా కొనసాగుతున్న వెండి ధర
-కిలో వెండి ధర రూ.2.45 లక్షలు



బంగారం ధరలు బుధవారం భారీగా తగ్గాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 తగ్గి రూ.1,35,900కు చేరింది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,030 తగ్గి రూ.1,48,260 వద్ద కొనసాగుతోంది. వరుసగా తగ్గుతున్న బంగారం ధరలతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గత మూడు రోజుల్లో బంగారం ధరలు గణనీయంగా దిగివచ్చాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మొత్తం రూ.3,160 తగ్గగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.2,900 మేర తగ్గింది. తక్కువ ధరలకు బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ తగ్గుదల కొంత అనుకూలంగా మారింది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు అమల్లో ఉండనున్నాయి. అయితే నగలు కొనుగోలు చేసేటప్పుడు ఆభరణాల తయారీ ఖర్చులు, ఇతర పన్నులు అదనంగా ఉండవచ్చు.

## వాట్సాప్‌లో కొత్త కాంటాక్ట్స్ ట్యాబ్!

-కాంటాక్ట్స్ నిర్వహణ మరింత సులభం
-కొత్త రూపంలో సెర్చ్ సదుపాయం
-ఆన్‌లైన్‌లో ఉన్నవారిని గుర్తించేందుకు గ్రీన్ డాట్
-పుట్టినరోజుల గురించి ప్రత్యేక అలర్ట్స్
-మెటా ఏఐకి అనుసంధానించే అవకాశం
-స్నేహితులను ఆహ్వానించేందుకు ప్రత్యేక ఆప్షన్
-ప్రస్తుతం ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌లో పరీక్షలు
-త్వరలో అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం




ప్రముఖ సందేశాల యాప్ వాట్సాప్ వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచేందుకు కొత్తగా 'కాంటాక్ట్స్ ట్యాబ్' ఫీచర్‌ను తీసుకురానుంది. దీని ద్వారా ఫోన్‌లోని పరిచయాలను నిర్వహించడం, స్నేహితులతో సంభాషణలు ప్రారంభించడం మరింత సులభం కానుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగిస్తున్న ఈ యాప్‌లో కొత్త ఫీచర్లతో వినియోగాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. కొత్త కాంటాక్ట్స్ ట్యాబ్‌లో మెరుగైన సెర్చ్ బార్ ఉండనుంది. దీని సాయంతో అవసరమైన వ్యక్తుల పేర్లను సులభంగా వెతకవచ్చు. అలాగే పరిచయాలను క్రమబద్ధంగా అమర్చుకునే సదుపాయం కూడా ఉండనుంది. ఆన్‌లైన్‌లో ఉన్నవారిని గుర్తించేందుకు గ్రీన్ డాట్ సూచికను చూపించే అవకాశం ఉంది. దీంతో ఎవరితో సంభాషణ ప్రారంభించాలనుకున్నా త్వరగా గుర్తించవచ్చు. ఈ ఫీచర్‌లో పుట్టినరోజుల గుర్తింపునకు ప్రత్యేక అలర్ట్స్, మెటా ఏఐకి సంబంధించిన లింక్, స్నేహితులను వాట్సాప్‌లోకి ఆహ్వానించే ఆప్షన్ వంటి సదుపాయాలు కూడా ఉండనున్నాయి. వీటితో పరిచయాల నిర్వహణతో పాటు యాప్‌లోని ఇతర సేవలను వినియోగించడం సులభతరం కానుంది. వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతకు వాట్సాప్ ప్రాధాన్యత ఇస్తోంది. ప్రస్తుతం ఈ కొత్త ఫీచర్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌లో పరీక్షల దశలో ఉన్నట్లు సమాచారం. పరీక్షలు పూర్తయిన తర్వాత దశలవారీగా అందరికీ అందుబాటులోకి తీసుకురావచ్చని భావిస్తున్నారు. అయితే, విడుదల తేదీ, తుది ఫీచర్లపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## పండుగ ఆఫర్లు.. హోండా కార్లపై రూ.2.35 లక్షల వరకు తగ్గింపు

-నవరాత్రి, దసరా సందర్భంగా ప్రత్యేక రాయితీలు
-ఎలివేట్ ఎస్‌యూవీపై గరిష్ఠంగా రూ.2.35 లక్షల ప్రయోజనాలు
-హోండా సిటీపై రూ.1.70 లక్షల వరకు తగ్గింపు
-అమేజ్ కారుపై రూ.67 వేల వరకు ఆదా
--ఎంపిక చేసిన వాహన నమూనాలు, వేరియంట్లకు మాత్రమే ఆఫర్లు
-పండుగ వేళ కారు కొనుగోలుదారులకు మంచి అవకాశం
-పాత ఎలివేట్ వేరియంట్లపై ప్రత్యేక రాయితీలు
-డీలర్ల వద్ద ఆఫర్ల వివరాలు తెలుసుకోవాలని సూచన




నవరాత్రి, దసరా పండుగలను పురస్కరించుకుని హోండా కార్ల సంస్థ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. అమేజ్, సిటీ, ఎలివేట్ మోడళ్లలో ఎంపిక చేసిన వేరియంట్లపై గరిష్ఠంగా రూ.2.35 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తోంది. పండుగ సమయంలో కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ఆఫర్లు కొంత ఊరటనివ్వనున్నాయి. హోండా ఎలివేట్ ఎస్‌యూవీపై అత్యధికంగా రూ.2.35 లక్షల వరకు తగ్గింపు ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే ఈ ఆఫర్లు ఫేస్‌లిఫ్ట్ లేని ఎంపిక చేసిన వేరియంట్లకు వర్తిస్తాయి. ఎస్‌యూవీ కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ రాయితీలు ఆకర్షణీయంగా మారనున్నాయి. హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌పై రూ.1.70 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తున్నారు. మరోవైపు, హోండా అమేజ్ కాంపాక్ట్ సెడాన్‌పై రూ.67 వేల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. మోడల్, వేరియంట్‌ను బట్టి తగ్గింపు మొత్తం మారుతుంది. ఈ ఆఫర్లు ఎంపిక చేసిన వాహనాలకు మాత్రమే వర్తిస్తుండటంతో కొనుగోలు చేసే ముందు సమీప హోండా డీలర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవడం మంచిది. పండుగ రాయితీలు, అందుబాటులో ఉన్న వాహనాల ఆధారంగా వినియోగదారులు తమ బడ్జెట్‌కు అనుగుణంగా కారును ఎంచుకోవచ్చు.

# స్పోర్ట్స్

## అనుమతి లేకుండానే టోర్నీలో పేరు.. నిర్వాహకులపై శిఖర్ ధావన్ చట్టపరమైన చర్యలు

-తన అనుమతి లేకుండా పేరు వాడుకున్నారని ఆరోపణ
-వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులపై ఆగ్రహం
-చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్న ధావన్ బృందం
-అనధికార ప్రకటనలను నమ్మొద్దని విజ్ఞప్తి
-మీడియా, అభిమానులు స్పందించవద్దని సూచన
-వన్డేల్లో 6,793 పరుగులు చేసిన మాజీ ఓపెనర్
-టెస్టుల్లో ఏడు శతకాలు సాధించిన ధావన్
-టీ20ల్లో 11 అర్ధశతకాలతో రాణించిన భారత క్రికెటర్




న్యూఢిల్లీ: వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులు తన అనుమతి లేకుండానే టోర్నీకి సంబంధించి తన పేరును ఉపయోగించుకున్నారని మాజీ భారత క్రికెటర్ శిఖర్ ధావన్ ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు తమ బృందం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన పేరును వాడుకోవడంపై ధావన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. తన పేరుతో వస్తున్న అనధికార ప్రకటనలను నమ్మవద్దని మీడియా సంస్థలు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా ధ్రువీకరించని సమాచారంపై స్పందించకుండా ఉండాలని సూచించారు. తన అనుమతి లేకుండా పేరు ఉపయోగించిన వ్యవహారంపై తమ బృందం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్లలోనూ ధావన్ ప్రాతినిధ్యం వహించారు. ముఖ్యంగా వన్డే క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో గుర్తింపు పొందారు. 167 వన్డేలు ఆడిన ఆయన 44.1 సగటుతో 6,793 పరుగులు సాధించారు. ఇందులో 17 శతకాలు, 39 అర్ధశతకాలు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో 34 మ్యాచ్‌లు ఆడిన ధావన్ 40.6 సగటుతో 2,315 పరుగులు చేశారు. ఈ ఫార్మాట్‌లో ఏడు శతకాలు, ఐదు అర్ధశతకాలు సాధించారు. టీ20ల్లో 68 మ్యాచ్‌లు ఆడి 1,759 పరుగులు చేశారు. ఇందులో 11 అర్ధశతకాలు ఉన్నాయి. భారత క్రికెట్‌లో విజయవంతమైన ఓపెనర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ధావన్.. ప్రస్తుతం తన పేరును అనుమతి లేకుండా ఉపయోగించిన వ్యవహారంపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు.

## ధోనీ, కోహ్లీ ఫార్ములా.. హర్మన్, స్మృతి విషయంలో రిపీట్ కావాలి: బీసీసీఐ

-మంధానకు భారత మహిళ క్రికెట్ పగ్గాలు
-హర్మన్ ప్రీత్ అండగా నిలవాలన్న బీసీసీఐ
-ధోనీ, కోహ్లీ ఫార్ములా ఇక్కడ రిపీట్ కావాలని ఆకాంక్ష



భారత మహిళా క్రికెట్ జట్టులో కెప్టెన్సీ మార్పు సమర్థవంతంగా సాగడానికి బీసీసీఐ ఒక స్పష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది. సుదీర్ఘకాలం పాటు జట్టును విజయవంతంగా నడిపిన హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టు బాధ్యతలను స్వీకరించింది. జింబాబ్వేతో జరగనున్న సిరీస్‌తో మంధాన కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. అయితే, కెప్టెన్ మారినా హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టులోనే సభ్యురాలిగా కొనసాగుతుండటంపై బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిథున్ మన్హాస్ మాట్లాడుతూ.. భారత పురుషుల జట్టులో విజయవంతమైన కెప్టెన్సీ మార్పిడి విధానాన్ని ఇక్కడ గుర్తుచేశారు. గతంలో మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా విరాట్ కోహ్లీకి మైదానంలో ఎంతగానో సహాయపడ్డాడు. ఫీల్డింగ్ మార్పులు, డీఆర్ఎస్ నిర్ణయాలు, బౌలింగ్ మార్పులలో ధోనీ వెన్నంటి ఉండి నడిపించిన తీరును మన్హాస్ ఉదాహరించారు. అదేవిధంగా గంగూలీ ధోనీకి, ధోనీ.. కోహ్లీ, రోహిత్‌కు, ఇప్పుడు రోహిత్ - విరాట్ కలిసి శుభ్‌మన్ గిల్‌కు దిశానిర్దేశం చేస్తున్న సంప్రదాయం మహిళా క్రికెట్‌లోనూ కొనసాగాలని ఆయన అన్నారు. కెప్టెన్సీ అనేది ఎంత అనుభవం ఉన్న ఆటగాడికైనా ఎంతో సవాలుతో కూడుకున్న వ్యవహారమని మన్హాస్ అభిప్రాయపడ్డారు. మైదానంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు లేదా నిర్ణయాలు తీసుకోవడంలో అయోమయం నెలకొన్నప్పుడు హర్మన్‌ప్రీత్ వంటి సీనియర్ ప్లేయర్ పక్కన ఉండటం మంధానకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. జట్టులో అనుభవజ్ఞులైన సీనియర్లు ఉన్నప్పుడే కొత్తవారికి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం అత్యంత సురక్షితమైన, సరైన పద్ధతి అని ఆయన అభిప్రాయపడ్డారు.రాబోయే ప్రతిష్టాత్మక టోర్నీలను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ మార్పును పక్కా ప్రణాళికతో చేపట్టింది. మంధానకు మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ నుంచి పూర్తి మద్దతు లభిస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. టీమిండియా ఇద్దరు గొప్ప దిగ్గజ ఆటగాళ్ల సేవలను ఒకేసారి ఉపయోగించుకుంటూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని అభిమానులు, విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రిన్స్ విలియమ్‌తో కలిసి క్రికెట్ ఆడిన గంగూలీ, రహానే



**లండన్:**
బ్రిటీష్ రాకుమారుడు ప్రిన్స్ విలియమ్ తో కలిసి భారత మాజీ క్రికెటర్లు సౌరవ్ గంగూలీ, అజింక్య రహానే ఫ్రెండ్లీ టెన్నిస్ బాల్ మ్యాచ్ ఆడారు. ప్రిన్స్ విలియమ్‌కు చెందిన పర్యావరణ సంస్థ ఎర్త్‌షాట్ అవార్డులను ఇవ్వనున్నది. దీని కోసం నిధుల సేకరణలో భాగంగా ఈవెంట్‌ను నిర్వహించారు. వచ్చే నెలలో ముంబైలో ఎర్త్‌షాట్ ప్రైజ్ సెర్మనీ జరగనున్నది. ఇటీవల రిటైర్ అయిన రహానేతో పాటు టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, వెస్టిండీస్ బ్యాటర్ బ్రియన్ లారా, ఇంగ్లండ్ ప్లేయర్లు జో రూట్, హ్యారీ బ్రూక్ కూడా ఈవెంట్‌కు హాజరయ్యారు. ప్రిన్స్ విలియమ్ ఆహ్వానం మేరకు క్రికెటర్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ ఆవరణలో మ్యాచ్ ఆడారు. ఎన్నో వేదికల్లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించానని, కానీ టెన్నిస్ బంతితో క్రికెట్ ఆడడం, అది కూడా బకింగ్‌హామ్ ప్యాలెస్ ముందు ఆడడం ఓ మరువలేని అనుభవం అన్నారు. లింక్డిన్ పోస్టులో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆరవ ఎర్త్‌షాట్ అవార్డులను నవంబర్ 17వ తేదీన ముంబైలో ఇవ్వనున్నారు.

# విజయ్ దేవరకొండ 'రణబాలి'
# అడ్వాన్స్ బుకింగ్స్ షురూ.!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, సెన్సేషనల్ హీరోయిన్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న తరుణంలో చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే అప్డేట్ అందించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత ద్వయం అజయ్ -- అతుల్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తుండగా, హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తుండటం విశేషం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, సింగిల్ స్క్రీన్లు మరియు మల్టీప్లెక్స్‌లలో రణబాలి అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రీ-సేల్స్ ఊపందుకున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఓవర్సీస్‌లో తొలి రోజు కేవలం తెలుగు వెర్షన్ మాత్రమే గ్రాండ్‌గా విడుదలవుతుండగా, ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. సినిమాకు హైప్ విపరీతంగా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్టోబర్ 16, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

### 'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్..
## త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి.అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.





చీర కట్టులో ముద్దుగా సురేఖ వాణి కూతురు..



## చైతూతో పెళ్లి తర్వాత ఆ విషయంలో నా ఆలోచ విధానం మారింది..

టాలీవుడ్ స్టార్ నాగచైతన్య సతీమణి శోభిత ధూళిపాళకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె అక్కినేని వారసుడు, స్టార్ హీరో నాగచైతన్యతో ప్రేమ, వివాహం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే పెళ్లి తర్వాత తన ఆలోచన విధానం మారిందంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఒక నటుడితో ప్రేమలో పడడంపై తన పాత అభిప్రాయాలు ఎలా మారాయో అనే విషయాలను మనసు విప్పి చెప్పారు. నటీనటులతో ఎప్పటికీ డేటింగ్ చేయబోనని కెరీర్ ఆరంభంలో చెప్పిన ఆమె ఇప్పుడు అదే కామెంట్స్ పై రియాక్ట్ అయ్యారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శోభిత తన వైవాహిక బంధం గురించి స్పందించారు. సంవత్సరాలు గడిచేకొద్దీ తన ఆలోచనా విధానం ఎలా మారిందో వివరించారు. తన వృత్తికి చెందిన వారితో డేటింగ్ చేయాలనుకోవడం లేదని 2016లో తాను చేసిన వ్యాఖ్యను గుర్తుచేసుకున్నారు."బహుశా నా చుట్టూ నేను చూసిన ఉదాహరణల వల్లేనేమో ఆ సమయంలో నేను ఒక మూసలో ఇరుక్కుపోయాను. అప్పుడు నా ఆలోచనా విధానం సంకుచితంగా ఉండి ఉంటుంది." అని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నమ్మారన్న కారణంతో ఒకే అభిప్రాయాలకు అంటిపెట్టుకుని ఉండకుండా, వయసు పెరిగే కొద్దీ విషయాలను భిన్నంగా చూసేందుకు ప్రజలు సుముఖంగా ఉండాలని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. "తమ అభిప్రాయాలను మార్చుకోని వారిని చూస్తే నాకు ఎక్కువ భయం. వేర్వేరు సమయాల్లో వేర్వేరు అభిప్రాయాలు కలిగి ఉండటంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. నేను పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని ఆమె అన్నారు.అలాగే నాగ చైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితంపై పెరిగిన పబ్లిక్ ఫోకస్, సోషల్ మీడియా చర్చలపై ఆమె స్పందించారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని.. వాటితో అతిగా మమేకమైతే మన సొంత అస్తిత్వాన్ని కోల్పోతామని అన్నారు. "సమాజం వాతావరణం లాంటిది. అది వస్తూ పోతూ ఉంటుంది. మీరు ఆ వాతావరణంతోనే ఎక్కువగా మమేకమైతే, వాతావరణం మారినప్పుడు మీరు దారి తప్పిపోతారు. కాబట్టి, స్థిరంగా ఉంటూ, వాస్తవికత ఏమిటో గమనిస్తూ ఉండటం ముఖ్యం అని నేను అనుకుంటున్నాను. ఆ విషయం తెలుసుకునే అదృష్టం నాకు కలిగిందని భావిస్తున్నాను. స్థిరంగా ఉండటం అనేది మీరు తీసుకునే ఒక నిర్ణయం" అని ఆమె అన్నారు.

# 'కల్ట్' వాయిదా పడినట్టేనా ..

**- విశ్వక్ సేన్ సినిమా రిలీజ్‌పై ఇంకా రాని క్లారిటీ!**




టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న క్రేజీ థ్రిల్లర్ చిత్రం 'కల్ట్' పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా భారతీయ తెరపై స్లాషర్ థ్రిల్లర్‌గా, 'ఏ' సర్టిఫికెట్‌తో కూడిన చిత్రంగా దీన్ని పరిచయం చేయడంతో ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. అయితే అక్టోబర్ నెలాఖరులో విడుదల చేస్తామని గతంలో ప్రకటించిన ఈ సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'కల్ట్' సినిమాను అక్టోబర్ చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం గతంలో వెల్లడించింది. ఈ నెల ప్రారంభంలో ఓ అప్‌డేట్ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత సినిమా గురించి పెద్దగా సమాచారం బయటకు రాలేదు.సాధారణంగా విడుదలకు దగ్గరపడుతున్న సినిమాలకు ప్రమోషన్లు, పోస్టర్లు, టీజర్లు లేదా ట్రైలర్లతో సందడి మొదలవుతుంది. కానీ 'కల్ట్' విషయంలో అలాంటి హడావుడి కనిపించకపోవడంతో సినిమా అనుకున్న సమయానికి విడుదలవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అక్టోబర్ నెలలో ఇప్పటికే సగానికి పైగా సమయం గడిచిపోయింది. అయినప్పటికీ విడుదల తేదీపై స్పష్టత లేకపోవడం, ప్రచార కార్యక్రమాలు ప్రారంభం కాకపోవడం వాయిదా వార్తలకు ఊతమిస్తోంది. అయితే సినిమా వాయిదా పడినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో విడుదల తేదీపై చిత్రబృందం నుంచి వచ్చే తదుపరి అప్‌డేట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. విశ్వక్ సేన్ తన సినిమాల్లో విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'కల్ట్'తో ఆయన మరోసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం విశేషం. స్లాషర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా, దాని కథాంశం మరియు చిత్రీకరణ శైలి కారణంగా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చకు వచ్చింది.ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తారక్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కథ, పాత్రలు, హింసాత్మక సన్నివేశాల నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ప్రకటనలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అయితే 'కల్ట్' విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు చిత్రబృందం అధికారిక ప్రకటనతోనే తెరపడనుంది

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831